ఆడవాళ్ళు భోంచేసినంత ఆలస్యంగా భోంచేసింది. మధ్యలో టైమ్ చూస్తే "మీ కన్నీతొందరే" అని దేనికి దేనికి లింకు పెడుతుందో అన్న భయంతో వూరుకుని చివరికి అంతా అయ్యేక టైమ్ చూసాను. పదీ నలభయ్!

అప్పుడు ఆ నెమలి పింఛం ధారుడు ఒక పెద్ద ప్లేటులో ఒక పావుసేరు వేయించిన సోపుగింజల మధ్యని పెట్టి బిల్లు పట్టుకొచ్చాడు. రెండు అరటి పండ్లు, రెండు కిళ్లీలు బోనస్.

"హోటల్ గాంధారి; నగరంలోని ఏకైక ఐదు నక్షత్రాల హోటల్" అని అందమైన అచ్చులో వుంది. చేత్తో రాసింది- రెండు వెగ్ మీల్స్ - 28 రూపాయలు. టాక్స్ రెండు రూపాయల నలభై పైసలు; వెరసి ముప్పయి రూపాయల ఎనభై పైసలు. థాంక్యూ. మళ్లీ రండి!

ఐదు నక్షత్రాలు అంటే ఐదు చుక్కలేగా! పట్టపగలు చుక్కలు పొడిచేయంటే పొడవ్వా మరి?

బిల్లు చెల్లించి టిప్పు ఇచ్చి బైటపడేసరికి టైమ్ పదకొండు. అయితే - గేటు దగ్గిర నారాయణరావు కనిపించి "ఆఫీస్‌కి సెలవు గురూ!" అని ఎవరో మాజీ మంత్రిగారు పోవడం అదంతా చెప్పుకొచ్చేసరికి ఎనభై రూపాయల నష్టం యాభైకి దిగింది కదాని సరదా వేసింది.

సెలవేకదా, ఏదో ఇంత తిన్నాం కదా, అని అక్కడా అక్కడా తిరిగి ఇంటికెళ్ళేసరికి తలుపు తీసుంది. లోపల మా బావమరిది గావంచా కట్టుకుని ఎదురొచ్చేడు. "రాత్రంతా తిండి, నిద్దరా లేదే అక్కయ్యా. వొంటింట్లో చూస్తే తాళింపులు మినహా అన్నీ రడీగా వుంటేనూ; అదే పదివేలని అన్నిట్లోనూ పోపులు వేసుకుని వొడ్డించుకు తినేసేను. నేనిప్పుడు అర్జంటుగా ఊళ్లోకి పనిమీదెళ్లాలి. అదిసరే గాని, అక్కా! అంతంత కొంచెం వొండుకుని ఎలా తింటున్నారే?" అన్నాడు.

మళ్లీ పట్టపగలు చుక్కలు పొడిచినట్టయింది! ★

# 11. లిఫ్ట్ ప్రవీణుడు

**కె.**అండ్.కె. కంపెనీ వాళ్లు మా ఆఫీసుకి సరఫరా చేస్తామని వొప్పుకున్న ఫర్నిచర్ తణికీ చెయ్యడానికి నేనూ, మా ఎకౌంట్స్ ఆఫీసర్ రమేశం గారు, మా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం గారూ ఈ పూట వెళ్లాలి. ఇద్దరూ సీట్లలో లేరు. వాళ్లిద్దరి స్టెనోలూ అసలీ తణికీ సంగతే తమకి తెలీదన్నారు. అనుకున్న టైం దగ్గర పడుతోంది.

సరిగ్గా అప్పుడొచ్చింది, హోటల్ మేనకా నించి ఫోను. రమేశం గారు మాట్లాడేరు. "మనం ముగ్గురం కె.అండ్.కె. కంపెనీకి వెళ్లాలి కదా. మీరు జనరల్ మేనేజర్ గారి జీపు అడిగి తీసుకుని మేనకా హోటల్‌కి వొచ్చేయండీ. నేను జి.ఎం. గారికి ఫోన్లో చెప్పేను, ఆయన జీపు ఇస్తారు." అన్నారు.

తీరా జీపు దగ్గిరకొచ్చేటప్పటికి స్టెనో రమణారావు "సార్, జీపు తమరే నడుపుకెళ్లాలి సార్. డ్రైవర్ సుబ్బయ్య ఇవాళ సెలవ్, సార్!" అని చెప్పి తాళాలిచ్చేడు.

ఔటు గేటు దాటుతూవుండగా ఒకాయన చెయ్యి అడ్డం పెట్టి జీపు ఆపమని సంజ్ఞ చేసేడు. గొప్ప ప్రమాదంలో పడ్డ ఓ మనిషి చావు బ్రతుకుల మధ్య చేసిన ఆక్రందనలా ఉంది. ఆ సంజ్ఞ, తప్పనిసరై ఆపేను.

"కోర్టు దాకా లిఫ్ట్ ఇవ్వగలరా?" అని అడిగాడు.

"సరే, యెక్కండి" అన్నాను.

జీపులో కూర్చుని ఆయన తనకి కోర్టులో పని ఉన్న సంగతి వివరంగా చెప్పేడు. ఈ రోజు శెలవు పెట్టాడట. కాని కోర్టులో ఇవాళ తను సాక్ష్యం ఇచ్చి తీరాలట. అంచేత సెలవు రద్దు చేసుకుని మరీ ఆఫీసుపని చేస్తున్నాడట. ఈ ఆలోచనల మధ్య ఆఫీసుకి రావడానికి లేటయి, కాగితాలు వెతుక్కోవడం వల్ల ఇంకా ఆలస్యం అయి, ఇంక బస్సులో వెళ్లడానికి గానీ, ఆటో. రిక్షా మాట్లాడుకోడానికి గానీ టైమ్‌లేక నాకు శ్రమ ఇస్తున్నాడట.

నేనెవరో అతను అడగలేదు. తనెవ్వరో చెప్పలేదు. నేనెవరో అతనికి తెలుసుననీ, తనెవరో నాకు తెలిసి వుంటుందని అతను నమ్మేడని అనుకొని వూరుకున్నాను. అతను కోర్టు దగ్గిర దిగిపోయి "థాంక్సండీ" అన్నాడు.

"తల్లిపాలకి థేంక్స్ ఉండవు." అన్నాను.

"అదేమిటండోయ్!?" అన్నాడతను.

"మీ మాటల్ని బట్టి మీరు పి.టి. అండ్ కో ఉద్యోగస్తులని తేలింది. ఇది కంపెనీ జీపు. మీరు డ్యూటీలో ఉన్నారు. అందుచేత -" అని లాగించేశాను.

నేను హోటల్ మేనకా పోర్టికోలో చేరేసరికే అక్కడ రమేశం గారూ, సుబ్రహ్మణ్యం గారూ నిలబడున్నారు.

"ఏమిటి, లేటు?" అన్నారు రమేశం గారు.

"ఎవరో వొకాయన. మన కంపెనీ ఉద్యోగే. కోర్టు దగ్గిర దింపమంటేను-"

"నల్లగా ఉన్నాడా?" సుబ్రహ్మణ్యం గారడిగేరు.

"ఆ"

"తెల్లచొక్కా, తెల్ల పాంట్లో టక్ చేసాడా?"

"ఔను!"

పెద్దపెట్టున నవ్వేరు సుబ్రహ్మణ్యం గారు. అంత చప్పుడు భరించలేక గేరు మార్చి నాకు చేతనైన విధంగా నేనూ చప్పుడు చేస్తూవుంటే వాళ్లిద్దరూ జీపులో కూర్చున్నారు.

"ఆయన మరెవరో కాదు. పరమేశం గారని, మన కంపెనీ పర్సనల్ ఆఫీసర్. మీకెక్కడా తగల్లేదా?"

"నాకెలా తగుల్తాడు? నేనెక్కడో స్టోర్స్‌లో సమాధిలో ఉంటానాయె"

"అతనికి లిఫ్ట్ ప్రవీణుడు - అని నిక్ నేమ్ ఉంది. మీకు తెలీదేమో. మీరు జీపుతో కనిపించారు గనకా జీపెక్కాడు. లేకపోతే మీ వీపు ఎక్కైనా సరే అతను తను అనుకొన్న చోటికి చేరుతాడు."

"ఇంతో అంతో ఆఫీసర్ కదా. ఓ స్కూటర్ కొనుక్కోవచ్చునే!" అన్నాను.

"స్కూటరేం ఖర్మ. అతను అడిగితే కారు కొనుక్కోడానికి ఋణం ఇస్తుంది కంపెనీ, అంత సీనియర్ ఆఫీసర్ ఆయన. మీరన్నట్టు స్కూటర్ కొన్నాడు, ఏడాది క్రితం అడ్వాన్స్ పెట్టి పదిహేను రోజులు వాడేడో లేదో; వాళ్ల అల్లుడు తనకి ఆ స్కూటరే కావాలని పేచీపెట్టి అమ్మాయిని పుట్టింట్లో వొదిలేశాడు. దాంతో ఈయన తనకి హార్టు ట్రబులని, స్కూటర్ తొక్కొద్దని డాక్టర్ సలహా ఇచ్చేడనీ యధాప్రకారంగా ఇతరుల లిఫ్టుల మీద ఆఫీసు కొస్తున్నాడు."

"సుబ్రహ్మణ్యం గారు మరీ చెప్తారు గానీ, నిజంగా అతనికి హార్టు ట్రబుల్ వుందండీ, గోపాలం గారూ!"; అని నన్ను ఓదార్చారు రమేశం గారు.

"స్విచ్చి నొక్కినచో లైటు వెలుగును" అనే చైతన్యం కొత్తగా వొచ్చిన వాడిలాగా నేను, ఆ మరుసటి రోజునుంచీ పరమేశం గారిని గమనించడం మొదలుపెట్టాను.

ఆయన మా కంపెనీ క్వార్టర్స్‌లోనే ఉంటారు. మా క్వార్టర్స్ నుంచి మెయిన్‌రోడ్ వరకూ చిన్న రోడ్డుంది. అంతే ఆయన నడిచేది. అక్కడ నిలబడి ఆఫీసుకి వెళ్లే స్కూటర్లు, కార్లు అన్నీ గమనించుకుంటూ నించుంటాడు. సిటీ బస్సు కోసం నిలబడినట్టుగా స్టాండ్‌లోనే ఉంటాడు. కాని ఎప్పుడూ బస్ మాత్రం ఎక్కడు.

పర్సనల్ ఆఫీసర్ కదా. ప్రతి ఉద్యోగికి కన్‌ఫర్మేషను, ప్రమోషన్ ఇలాంటి అవసరాలు ఏవో ఉంటూనే ఉంటాయి. అంచేత ఆయన -"కాస్త ఆఫీస్ దాకా లిఫ్ట్ ఇస్తారా" అని అడిగేక కాదనగలిగే 'దమ్స్' ఎవరికీ వుండవు. అసలు ఆ జంక్షన్ దగ్గిన ఆయన కనబడితే ఆయన చెయ్యి అడ్డం పెట్టే విధానం చూస్తే ఏ వాహనమైనా ఆగిపోక తప్పదు. ఒక్కొక్క రోజున ఆయన మరీ తొందరగా ఆఫీసుకి చేరాలనుకుంటే చెయ్యి అడ్డం పెట్టడంతో సరిపుచ్చుకోక; తనే ఆ మొదటి కొద్ది వాహనాలకీ అడ్డం పడిపోతాడు. ఏక్సిడెంట్ చేసి కోర్టుకో జైలుకో వెళ్లేకంటే ఇదే నయం అని ఎవరో ఒకరు అతన్ని ఎక్కించుకుని మిగిలిన వాళ్ల క్షోభ తగ్గించేస్తారు.

ఇంక సాయంకాలం ఇంటికి చేరడం మాట కొస్తే అతని పని మరింత సుళువు. ఐదు గంటలకి ఆఫీసు అయిపోతుంది కదా. ఏదో ఒక ఫైలు మీద "స్పీక్" అనో "డిస్కస్" అనో రాసేసి; ఆ ఫైలుకి సంబంధించిన వ్యక్తి రాగానే (అంటే ఫైలు సంతకం పెట్టాకనే సుమండీ) "సాయంకాలం నన్ను కాస్త ఇంటి దగ్గర డ్రాప్ చేస్తారు కదూ?" అంటాడు. పని జరిగిపోతుంది.

అలా "స్పీక్" రాయడానికి ఏ ఫైలూ లేకపోతే స్కూటర్ స్టాండ్ దగ్గర ఐదు నిమిషాలు తక్కువ ఐదుకి కాపలా కాసేడన్నమాటే.

పరమేశం గారు మొన్నీ మధ్యే కారు కోసం రుణం తీసుకునే అర్హత ఇచ్చే జీతం స్థాయికి ఎదిగాడు. కారు కోసం రుణం తీసుకున్నాడు. కారు కొన్నాడు కూడాను. అయితే అల్లుడో, కొడుకో అది కావాలని పేచీ పెట్టక ముందే ఆ కారుని ఊళ్లో కొత్తగా పెట్టిన ఫైవ్ స్టార్ హోటల్ వారికి టాక్సీ కింద నడుపుకోడానికి గాను దీర్ఘకాలిక పద్ధతిని అద్దెకిచ్చేశాడు.

'లిఫ్ట్ ప్రవీణులు - వర్ధిల్లాలి!' అని; ఇప్పుడు మా కంపెనీ నినాదం.

★